తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం వార్షికోత్సవం 1996 - 2026




తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటిగా పుట్టమన్ను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెఇఓ తదితర అధికారులు పాల్గొన్నారు. -ప్రభాతవార్త, తిరుమల

# విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల చోరీలతో...నష్టపోతున్న రైతులు




రైల్వే కోడూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త : రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఉన్న ఓబులవారిపల్లి, రైల్వే కోడూరు, పుల్లంపేట, చిట్వేలి,పెనగలూరు మండలాలలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల చోరీలు అధికంగా జరుగుతున్నాయి. వీటి పట్ల చర్యలు తీసుకోవలసిన పోలీసులు గస్తీలకు స్వస్తి చెప్పడంతో చోరీలు అధికమై రైతులు లక్షల్లో నష్టపోతున్నారు. వీటిపట్ల ఒకటి కాదు రెండు కాదు గత నాలుగైదు ఏడాదులుగా ఈ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల చోరీలు అధికంగా జరిగి రైతులను తీవ్ర నష్టాలకు గురిచేస్తుండడం ఆనవాయితీగా మారింది. పోలీసులు చేయాల్సిన పనిని వారు వాటి పట్ల శ్రద్ధ పెట్టకపోవడంతో రైతులే కాపు కాచి కొంతమంది విద్యుత్ చోరీలు చేసే దొంగలను పోలీసులకు పట్టించిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. అయితే వారి నుంచి విద్యుత్ సామాగ్రి రికవరీ చేసి వారి పట్ల చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేసి భవిష్యత్తులో ఇలాంటి చోరీలు జరగకుండా భయపెట్టాల్సిన పోలీసులు ప్రజలు పట్టించిన నిందితుల పట్ల చేతులు కలిపి స్నేహభావంతో వారిని వదిలేయడం అమానుషం.ఇటీవల గత పది రోజుల నుంచి ఓబులవారిపల్లి మండలంలో చిన్న రాజు పోడు గాజుల చెన్నవరంపాడు, ఓబులవారిపల్లి, పెద్దవరంపాడు, కొర్లకుంట ప్రాంతాలలో అధికంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను పగులుగొట్టి అందులో ఉన్న ఆయిల్ సామాగ్రిని తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. ఇదే విధంగా మిగిలిన నాలుగు మండలాల్లో కూడా విద్యుత్ చోరీలు విపరీతంగా జరుగుతున్నాయి. ప్రతి రాత్రి రైతు పొలాల్లో మోటార్లు, స్టార్టర్ల వైర్లు, సోలార్ పరికరాలు దొంగిలిస్తూనే ఉన్నారు. ఓబులవారిపల్లి మండలంలో ఈ చోరీలు ఈరోజు ఆరోజు అనకుండా ప్రతినిత్యం ఒకటి రెండు చోట్ల కాదు సుమారు ఇరవై చోట్ల తరచూ జరుగుతూనే ఉన్నాయి.వీటి పట్ల రైతులు లక్షల్లో నష్టపోతున్నారు. విద్యుత్ చోరీలు చేసిన దొంగలు తీసుకువెళ్లిన సామాగ్రిని రైల్వేకోడూరు లోనూ, రాజంపేట ప్రాంతాలలో గుజిరి వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు కూడా రైతులు కనుగొన్నారు. ఈ విషయంపై కూడా చోరీకి గురి అయిన వస్తువులను అక్రమంగా కొనుగోలు చేసిన ఆ వ్యాపారిపై రైతులు ఇటీవల కోడూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు కూడా తెలిసింది. అయితే ఆ స్టేషన్లలో బాధితుల కంటే అక్రమార్కులు అక్రమ విద్యుత్ సామాన్లను కొనుగోలు చేసే నిందితులకు సకల మర్యాదలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా రైతుల్లో లేకపోలేదు. వీటి పట్ల పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి అనుమానాస్పదలైన రైతులు చెప్పిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి వాటిని అదుపు చేయకపోతే దేశానికి వెన్నుముక లాంటి రైతుల నష్టాలను పూడ్చే పరిస్థితులు ఉండకపోవచ్చు. ఇప్పటికీ గత పది రోజుల నుంచి లెక్కపెడితే ఓబులవారిపల్లి మండలంలో దాదాపు కోటి రూపాయల విలువచేసే రైతులకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, మోటారు వైర్లు, స్టార్టర్లు, సోలార్ పరికరాలు చోరీకి గురి అయినట్లు తెలుస్తుంది.ఇదే విధంగానే మిగిలిన నాలుగు మండలాల్లో కూడా చోరీలు అధికంగానే జరుగుతున్నాయి.వీటితో సామాగ్రి నష్టం ఒక ఎత్తు అయితే అవసరానికి తగ్గట్టుగా చోరీకి గురైన పరికరాలను సమకూర్చుకోలేక సాగుచేసిన పంటలకు సకాలంలో నీటిని అందించుకోలేక లక్షల్లో నష్టపోయే పరిస్థితులు రైతులు ఎదుర్కొంటున్నారు.

# సీనియర్ టిడిపి నేతలకు పదవీ యోగం!

-స్థానిక సంస్థల ఎన్నికల వేళ నామినేటెడ్ పదవులపై ఆశలు

ప్రభాతవార్త-తిరుపతి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల దాటడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు టిడిపి సీనియర్ నాయకుల్లో పదవులపై ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీకి బలమైన నాయకత్వాన్ని అందించగల వారికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు కట్టబెట్టే అంశంపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. 2024 సెప్టెంబర్ 24న కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలపరిమితితో 20 నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. ఇందులో టిడిపికి చెందిన నేతలకు 16, జనసేనకు 3, బిజెపికి ఒక పదవి దక్కాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన తిరుపతి నేత అనిమిని రవి నాయుడికి శాప్ చైర్మన్ పదవి, కుప్పం ప్రాంతానికి చెందిన మునిరత్నంకు ఆర్టీసీ వైస్ చైర్మన్ పదవులు దక్కాయి. ఈ పదవుల కాలపరిమితి వచ్చే నెలలో ముగియనున్న నేపథ్యంలో కొత్త నియామకాలపై ఆసక్తి నెలకొంది. ఇదే సమయంలో ఆర్టీసీ చైర్మన్, ఏపిఐఐసీ, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ వక్ఫ్ బోర్డు, ఏపీ హౌసింగ్ బోర్డు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ట్రైకార్, లిడ్‌క్యాప్, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్, ఏపీ టిడ్కో తదితర సంస్థల్లో చైర్మన్ పదవుల భర్తీపై కూడా చర్చ సాగుతోంది.

ఇప్పటికే ఖాళీగా ఉన్న మరికొన్ని కార్పొరేషన్ చైర్మన్ పదవులను కూడా భర్తీ చేస్తే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నేతలకు అవకాశం లభించే అవకాశం ఉందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. మొత్తంగా నలుగురైదుగురికి రాష్ట్ర ,స్థానిక స్థాయిలో కీలక పదవులు దక్కవచ్చన్న ప్రచారం పార్టీ వర్గాల్లో సాగుతోంది. తిరుపతి జిల్లా నుండి సూరా సుధాకర్ రెడ్డి, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, మబ్బు దేవనారాయణ రెడ్డి, బుల్లెట్ రమణ, పుష్పావతి యాదవ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్సీవీ నాయుడు తదితరుల పేర్లు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లా నుండి డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి, డాక్టర్ సప్తగిరి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎ.ఎస్. మనోహర్, సి.కె. లావణ్య, కోదండ యాదవ్, భీమినేని చిట్టిబాబు నాయుడు తదితరుల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వీరిలో ఎవరికీ ఏ పదవి దక్కుతుందన్నది ఇప్పటికి స్పష్టత లేదు. కొందరికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు, మరికొందరికి మేయర్ మున్సిపల్ చైర్మన్ వంటి స్థానిక సంస్థల పదవులు దక్కవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్టోబర్,నవంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ నాయకత్వం పదవుల పంపకంపై వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చాలాకాలంగా పదవుల కోసం ఎదురుచూస్తున్న సీనియర్ నేతలకు ఈసారి అవకాశం దక్కుతుందా? కొత్త సమీకరణాలకు ప్రాధాన్యం లభిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది.పదవుల కోసం ఎదురు చూస్తున్న నేతల్లో ఎవరికి అదృష్టం వరిస్తుందన్నదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# సమన్వయంతో...బ్రహ్మోత్సవాలు

-బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు -భక్తులందరికి సంతృప్తికర, సౌకర్యవంతమైన దర్శనం -జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

కాణిపాకం, ఆగస్టు 22 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి సమన్వయంతో పని చేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని సంభందింత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కాణిపాకం దేవస్థానంలో సెప్టెంబర్ 14 నుండి జరుగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు,ఈఓ కె.పెంచల కిషోర్‌లతో కలసి వివిధ ప్రభుత్వశాఖల జిల్లా స్థాయి అధికారులతో శనివారం స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో సమన్వయ కమిటి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాణిపాకం ఆలయంలో సెప్టెంబర్ 14 నుండి అక్టోబర్ 4 వరకు స్వామివారి వార్షిక బ్రహోత్సవాలు జరుగుతుందని తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాలనుండి అశేషంగా తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రెవెన్యూ, పోలీస్, ఆర్‌అండ్‌బి, విద్యుత్, ఆరోగ్యశాఖ, పంచాయతీ రాజ్, ఆర్టీసీ, అగ్నిమాపకశాఖ తదితర శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టి విజయవంతం చేయాలని తెలిపారు. ఎక్కడా ఎలాంటి పొరబాట్లు జరగకుండా భక్తులకు మంచి దర్శనం కల్పించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక అధికారులు ఆలయం లోపల, వెలుపల విద్యుత్ సరఫరాలో ఎమైనా లోటుపాట్లు వున్నాయో పరిశీలించాలన్నారు. వాహనాలు తిరిగే సమయంలో విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ వుండాలన్నారు. వివిధ ప్రాంతాల నుండి కాణిపాకం వచ్చే రోడ్లుకు ఇరువైపుల వున్న ముళ్ళ పొదలను తొలగించడంతో పాటు రోడ్లును వెంటనే యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేయించాలని సంభందిత అధికారులను ఆదేశించారు. దేవస్థానం వద్ద ప్రోటోకాల్ నిర్వహణకు తహశీల్దార్, డిటీలతో ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేయాలని ఆర్డీఓ శ్రీనివాసులును ఆదేశించారు. ఉత్సవాలు సందర్భంగా ఆలయం వద్ద వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు,



బ్రహ్మోత్సవాలపై జరిగిన అధికారుల సమన్వయ కమిటి సమావేశంలో

నైపుణ్యం కలిగిన వైద్యులను నియమించుకుని సేవలందించాలని డీఎం అండ్ హెచ్‌ఓను ఆదేశించారు. కాణిపాకం ఆలయం పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, మొబైల్ లాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని, భక్తులకు సురక్షితమైన తాగునీరు అందించాలని డీపీఓ సుధాకర్‌రావును ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులు సౌకర్యార్థం రాష్ట్రంనుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి కాణిపాకం వరకు ప్రత్యేక బస్సులు నడపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ ఆలయంలో జరుగనున్న సెప్టెంబర్ 14 నుండి 21 రోజుల పాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను సంప్రదాయ రీతిలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా అత్యంత వైభవోపేతంగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో తగు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆలయ దర్శనార్థం వచ్చే ప్రతి భక్తునికి స్వామివారి దర్శనం సంతృప్తికరంగా, సౌకర్యవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. భక్తులు కాణిపాకం ఆలయం లోపలకు వచ్చినప్పటి నుండి వెలుపలకు వెళ్ళే వరకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ముఖ్యంగా భక్తుల భద్రత కోసం డ్రోన్ కెమెరాలు, మ్యాన్ ప్యాక్‌లు ఏర్పాటు చేసుకుని ఆలయ పరసరాలన్ని సీసీ కెమెరాల నిఘాలో వుంచాలన్నారు.అలాగే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు లాభనష్టాలతో నిమిత్తం లేకుండా భక్తుల సౌకర్యార్థం చిత్తూరు, తిరుపతి పట్టణాలకు రాత్రి వేళల్లో కూడా ఆర్టీసి బస్సుసర్వీసులు నడపాలని సూచించారు. లక్షలాది మంది భక్తులు నిర్భయంగా, నిశ్చింతంగా బ్రహ్మోత్సవాలకు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈసమావేశంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల రోజుల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకుని 24 గంటలు పోలీసులు విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆలయం వద్ద ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరుగకుండా కండిషన్ వున్న ఫైర్ ఇంజిన్‌ను సిద్ధంగా వుంచుకోవాలని తెలిపారు. ఆలయ ఛైర్మన్ వి.మణి నాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్ ఆలయ ఉభయదారులు కమిటీ ఛైర్‌పర్సన్ శివశకంకరి, ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ వెంకట రమణ, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, డీఎంఅండ్‌హెచ్ నాగ శశిభూషణ్‌రెడ్డి, అడిషనల్ డీఎంఅండ్‌హెచో వెంకట ప్రసాద్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ,ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈలు మునిచంద్ర, విజయ్‌కుమార్, ఆలయ ఏఈఓలు ప్రసాద్, హరిమాధవరెడ్డి ఎస్వీ.కృష్ణారెడ్డి, ధనపాల్, చిత్తూరు రూరల్ సీఐ శ్రీదర్‌నాయుడు, స్థానిక ఎస్పై నరసింహులు, పిఆర్ ఏఈ ప్రసాద్‌నాయుడు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

# కుప్పంలో 4కోట్లతో కోల్డ్‌స్టోరేజ్

-1.50కోట్లతో రైతు బజార్ మంజూరు-2వేల ఎకరాల్లో పెరిగిన పట్టు -కుప్పంలో అగ్రిటూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు-ప్రైమరీ సెక్టార్‌లో గణనీయ ప్రగతి - రైతుల్ని ఆర్థికంగా పైకి తేవడమే ప్రభుత్వం లక్ష్యం - ఎంసి చైర్మన్ జిఎం రాజు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎఎంసి చైర్మన్

కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త :ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం వ్యవసాయ మార్కెట్‌యార్డులో నాలుగుకోట్ల వ్యయంతో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణంకు చర్యలు చేపట్టినట్లు ఎఎంసి చైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎ ఓపిఎ శ్రీకాంత్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, ఎఎంసి వైస్‌ఛైర్మన్ శరవణ, కమిటీ సభ్యులతో కలసి ప్రసంగించారు. తనకు సిఎం చంద్రబాబు గాడ్‌ఫాదర్ అన్నారు. తమ కుటుంబం ఆయనకు రుణపడి ఉంటుందన్నారు. కుప్పం ప్రజల సౌకర్యార్థం సిఎం చంద్రబాబు 1.50కోట్లతో రైతుబజార్‌ను మంజూరు చేశారన్నారు. వచ్చే పర్యటనలో సిఎం దీనికి శంకుస్థాపన చేస్తారన్నారు. కుప్పం మార్కెట్ యార్డు లోనే వ్యవసాయ అనుబంధ శాఖలు, విభాగాలకు కార్యాలయాలు నిర్మించి మరో పది ఎకరాల్లో మార్కెట్‌యార్డు విస్తరణతో పాటు అగ్రిటూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రైతులను ఆర్థికంగా పైకి తేవడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇప్పటికే మార్కెట్ యార్డులోనీటి బోర్లు, వీధిలైట్లు, మరుగదొడ్ల వసతులు కల్పించామన్నారు.

**ప్రైమరీ సెక్టార్‌లో గణనీయ ప్రగతి :**

ప్రైమరీ సెక్టార్‌లో కుప్పంలో గణనీయమైన ప్రగతిని సాధించినట్లు ఎఎంసిఛైర్మన్ రాజు పేర్కొన్నారు. అగ్రికల్చర్,హార్టీకల్చర్, సిరికల్చర్, నేచరల్ ఫార్మింగ్ రంగాల్లో పంటల విస్తీర్ణం సైతం పెరిగిందన్నారు. రెండువేల ఎకరాల్లో పట్టుసాగు పెరిగిందన్నారు. అలాగే 450ఎఫ్‌పిఓలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే రైతుల పంటలకు బీమా సౌకర్యం కల్పించామన్నారు. 20గ్రీన్‌హౌస్‌లను కడ సహకారంతో మరమ్మతులు చేయించామన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా రైతులకు ఉచితంగా నార్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పట్టుశాఖలో మరో రెండు ఆటోమేటిక్ వీవింగ్‌యూనిట్లు త్వరలో ప్రారంభిస్తామన్నారు. పట్టురైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.కుప్పంలో పాల ఉత్పత్తి పదిలక్షల లీటర్ల వేరేలా చర్యలు చేపట్టామన్నారు. అలాగే అన్ని పంచాయితీల్లో బిఆర్‌సి సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. 7036మంది రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌లో రాయితీ అందించినట్లు చెప్పారు. రైతులకు ఉచితంగా సోయా విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ప్రకృతి వ్యవసాయం పెంచేందుకు ఇటీవలే మిల్లెట్‌మ్యాన్ పద్మశ్రీ ఖాదర్‌వలీతో రైతుల ముఖాముఖి నిర్వహించామన్నారు.ఎఎంసి డైరెక్టర్లు చంద్రకళ, హరినాథరెడ్డి, సుబ్బు, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు శ్రీకారం

-నేటి నుంచి 28 వరకు రాధా గోవిందుల డోలోత్సవం-సెప్టెంబరు 3న గోపూజ,4న జన్మాష్టమి



ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లును ప్రారంభిస్తున్న దృశ్యం

తిరుపతి విద్య, ఆగస్టు 22 ప్రభాతవార్త: ఇస్కాన్ తిరుపతి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు శనివారం శ్రీకారం చుట్టారు. సెప్టెంబరు 4న నిర్వహించనున్న మహా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆలయ నిర్వాహకులు, సీనియర్ భక్తులు ఘనంగా ఆవిష్కరించారు. జన్మాష్టమిని పురస్కరించుకుని ఆరు రోజులపాటు డోలోత్సవం, గోపూజ, అధివాస మహోత్సవాలతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీశ్రీ రాధా గోవిందుల ఉంజల్ సేవ (డోలోత్సవం) ఆగస్టు 23 నుంచి 28వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ తిరుపతి ఆలయ కార్యదర్శి, సమాచార విభాగం ప్రతినిధి హెచ్.జి. లీలా పరాయణ దాస్ తెలిపారు. డోలోత్సవం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. ఆగస్టు 28న డోలోత్సవం ముగియనుండగా, అదే రోజు శ్రీ బలరాముల వారి ఆవిర్భావ దినోత్సవం కావడంతో ప్రత్యేకత సంతరించుకుంటుందని తెలిపారు.సెప్టెంబరు 3న గోపూజా మహోత్సవం, అధివాస మహోత్సవాలను నిర్వహించనున్నారు. ప్రధాన జన్మాష్టమి వేడుకలకు ముందు నిర్వహించే ఈ కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తాయని పేర్కొన్నారు.సెప్టెంబరు 4న ఇస్కాన్ తిరుపతిలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే సందర్భంగా ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్యులు ఏ.సి. భక్తివేదాంత స్వామి శ్రీల ప్రభుపాదుల 130వ ఆవిర్భావ వార్షికోత్సవాన్ని కూడా నిర్వహించనున్నారు. వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇస్కాన్ తిరుపతి చైర్మన్ హెచ్.జి. రేవతి రమణ ప్రభు, వైస్ చైర్మన్ హెచ్.జి. రూపేష్ చైతన్య ప్రభు, ప్రధాన అర్చకులు హెచ్.జి. మురళీ గోవింద ప్రభు, హెచ్.జి. సనాతన గౌర ప్రభు, హెచ్.జి. గోపాల నిమై ప్రభు, హెచ్.జి. మధు గోపాల హరి ప్రభు, హెచ్.జి. నిత్య ముక్త ప్రభు, హెచ్.జి. బాలభద్ర మాధవ ప్రభు, హెచ్.జి. రూపానుగ ప్రభు, హెచ్.జి. నవ గౌరాంగ వర ప్రభు, హెచ్.జి. శ్రీహరి హృషీకేశ్ ప్రభు, హెచ్.జి. ధన్య గోపాల ప్రభు, హెచ్.జి. కృష్ణ కిశోర్ గోపాల ప్రభు, బీబీటీ బృంద సభ్యులు, వివిధ విభాగాల అధిపతులు, ప్రతినిధులు, సీనియర్ భక్తులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయికి ఎదిగిన ఐఐటి విద్యార్థులు

## 457 మందికి డిగ్రీలు- ఘనంగా స్నాతకోత్సవం

శ్రీకాళహస్తి, ఆగష్టు 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి సమీపంలో నిర్వహిస్తున్న తిరుపతి ఐఐటి 8వ స్నాతకోత్సవం శనివారం ఆవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ డిగ్రీలను విద్యార్థులకు అందించారు. 457 మంది విద్యార్థులకు స్నాతకోసవ సభలో అతిథులు అందించారు.ఈ కార్యక్రమాలకు ఆశోక చక్ర గ్రహీతగ్రూప్ కెప్టెన్ శుభాంశుక్ల ముఖ్యఅతిథిగా హాజరైన సభకు డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. మరో ముఖ్యఅతిథిగా తిరుపతి బోర్డు ఆఫ్ గవర్నర్ చైర్మెన్ సద్దాన్ జిందాల్ హాజరుయ్యారు.2026 గ్రాడ్యుయేషన్ బ్యాచ్‌లో ప్రతిభ కనబరచిన కంప్యూటర్ సైన్స్‌లో మోక్షితా రెడ్డికి రాష్ట్ర పతి బంగారు పతకం సాధించటం కళాశాల ప్రగతికి ఇక్కడ విద్యాప్రమాణాల ప్రతిభకు తార్కాణమని డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు.

**తిరుపతి ఐఐటిలో పతకాల పంట:**

బిటెక్ ప్రోగ్రామ్‌లలో అత్యుత్తమ విద్యా ప్రతిభ కనబరచిన కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన టంగుటూరు మోక్షిత రెడ్డికి రాష్ట్ర పతి బంగారుపతకాన్ని అందించగా పాఠ్య,పాఠ్యేతర కార్యక్రమాలలో సర్వతోముఖాభివృద్ధి ప్రతి కనబరచిన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన శుభం మోహంతి గవర్నర్ అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ 2015లో ఐఐటి స్థాపించినప్పటి నుంచి ఎలా అభివృద్ధి చెందిందో వివరించారు. 548 ఎకరాల విస్తీర్ణంలో విద్యార్థుల భవిష్యత్తునుమార్చేందుకు విద్యా ప్రమాణాలనుపెంచుటకు కృషి చేసామన్నారు. విద్య అనేతి నిరంతరం అన్నారు. సమాజానికి విద్యార్థులు సేవలందించాలన్నారు. జీవితాంతం నేర్చుకునే వారుగా తిరుపతికి ఐఐటికి గర్వకారణంగాను రాయబారులుగా నిలవాలన్నారు. తిరుపతి ఐఐటి విద్యా కార్యక్రమాలను ఎలా అభివృద్ధి చెందిందో పరిశోధనలు, ఆవిష్కరణలు,పారిశ్రామిక భాగస్వామ్యంతో ఎలా విస్తరించాయో వివరించారు. ప్రాయోజిత పరిశోధన పారిశ్రామిక కన్సెల్టెన్సీ,ఇంక్యూబేషన్,అంతర్జాతీయ సహకారాలు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ క్వాంటం టెక్నాలజీ రోబోటిక్స్, అంతరిక్షశాస్త్రం,శక్తి,మరియు అలానమస్ సిస్టమ్స్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల ద్వారా పరిశోధనా పర్యావరణ వ్యవస్థలను బలపడుతోందన్నారు. సిఎస్ఆర్ కార్యక్రమాలు విద్యార్థుల అవకాశాలు, ప్రణాళికా బద్ధమైన ఫేజ్-బిక్యాంపస్ విస్తరణను కూడా ఆయన ప్రస్తావించారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు జిజ్ఞాసతో ఉండాలన్నారు. సాంకేతిక అనేది ఒక సాధనం మాత్రమేనని అంతిమ లక్ష్యం కాదని గుర్తించుకోవాలని సంస్థకు సమాజానికి తిరిగి సేవలందించాలన్నారు. బోర్డుఆఫ్ గవర్నర్ సజ్జన్ జిందాల్‌మాట్లాడుతూ తిరుపతిఐఐటి స్థాపించినప్పటి నుంచి విద్యాపరిశోధన ఆవిష్కరణ రంగాల్లో సాధించినప్రగతిని కొనియాడారు. పట్టభద్రులు తమ వృత్తి జీవితాన్ని ప్రారంభించే సమయంలో శీలం సామర్థ్యం, నిజాయితిగా వ్యవహారించాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన శుభాంశుక్ల మాట్లాడతు విద్యార్థుల ప్రగతిని అభినందిస్తూ పట్టభద్రులైన ఉద్యోగులు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.సరైన అవకాశాలను గుర్తించి విస్తృత దృక్పధాన్ని పెంచుకోవాలన్నారు.తమ లక్ష్యాలను ఆశయాలను సాధించే క్రమంలో పరిస్థితులకు అనుగుణంగా మారే గుణాన్ని కల్గి ఉండాలన్నారు. పట్టభద్రులైన విద్యార్థులు అధ్యాపకులతో మమేకమయ్యారు.




స్నాతకోత్సవం సభలో పాల్గొన్న డైరెక్టర్ సత్యనారాయణ, కెప్టెన్ శుభాంశుక్ల

## మెగాస్టార్ పుట్టినరోజున మెగా రక్తదానం.

చిట్వేలి, ఆగస్టు 22 ప్రభాతవార్త: తమ అభిమాన నాయకుడు కొణిదెల చిరంజీవి పుట్టినరోజున శనివారం



రాజుకుంట సచివాలయ పరిధిలో కూటమి నాయకులు నానబాల నాగార్జున, గుత్తి నరసింహ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రాష్ట్ర జనసేన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రాణదానంతో సమానమైన రక్తదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం యువత సేవా దృక్పథానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు మద్దూరి మన్మథ, మాదాను నరసింహా, మాజీ ఎంపీటీసీ శివశంకర్ రాజు, మాదాను శివ,అవినాష్, సాయి, పవన్, తేజ,నానబాల లోక్ నాథ్, గొల్లపల్లి చెంగల్ రాయుడు,యన్నారు లోక్ నాథ్, మాదినేని రాజా, హరి ప్రసాద్, సుధీర్ రెడ్డి, సిహెచ్ఎస్ బాధ్యుడు గాడి ఇంతియాజ్ పిహెచ్ వైద్యులు డాక్టర్ శివప్రసాద్ గౌడ్, నియోజకవర్గ స్థాయి పరిధిలోని కూటమి నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలలో సత్తా మాదే: ముక్కారూపానంద రెడ్డి



రైల్వే కోడూరు రూరల్,ఆగస్టు 22 ప్రభాతవార్త: రానున్న స్థానిక ఎన్నికలలో సత్తా చూపిస్తామని రైల్వే కోడూర్ టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపనందరెడ్డి అన్నారు. శనివారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవ రాజాపురం టిడిపి కార్యాల యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థులను అన్ని స్థానాలను విజయవంతంగా గెలిపించుకుంటామని రైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి అన్నారు. ఎన్నికలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ లు చేసిన అభివృద్ధిని ప్రజలలోకి తీసుకెళ్లి అభ్యర్థులను గెలిపించుకుంటామని అన్నారు. మాది చేతల ప్రభుత్వం అని చెప్పినవి చెప్పినట్లుగానే విజయవంతంగా పనిచేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం చౌకబారు ప్రకటనతోనే కాలయాపన చేసి ప్రజలకు చుక్కలు చూపించిందని అన్నారు. ఏనాడైనా ప్రజా సంబంధ సమస్యలపై దృష్టి పెట్టలేదని అందువల్లనే రాష్ట్రంలో వైసిపి తుడుచుపెట్టుకు పోయిందని వారు అన్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాలలో అభివృద్ధిని ధ్యేయంగా పెట్టుకుని నిరంతరము కష్టపడి పనిచేసే అభ్యర్థులను గెలిపిస్తామని అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిన అభివృద్ధిని గ్రామీణ ప్రాంత ప్రజలకు డోర్ టు డోర్ కార్యక్రమం ద్వారా అన్ని మండలాలలో జోరుగా ప్రచారం చేసామని అన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని అన్నారు. ఎన్నికలలో ఐదు మండలాల నాయకుల, కార్యకర్తల సహకారంతో విజయవంతంగా అభ్యర్థులను గెలిపించు కొని రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉప ముఖ్యమంత్రికి బహుమతిగా ఇవ్వనున్నట్లు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి వివరించారు.

## అనర్హులుగా గుర్తించిన ఓటర్ల అభ్యర్థనల పరిశీలన

రేణిగుంట, ఆగస్టు 22ప్రభాతవార్త:



ఎస్ఐఆర్ ప్రక్రియలో అనర్హులుగా గుర్తించి నోటీసులు జారీ చేసిన ఓటర్ల నుంచి అందిన అభ్యంతరాలు, అభ్యర్థనలను మండల స్థాయి అధికారులు శనివారం పరిశీలించారు. రేణిగుంట ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో రవిచంద్ర, డిప్యూటీ తహసీల్దార్ శ్యాంప్రసాద్ తమ సిబ్బందితో కలిసి దరఖాస్తుదారులు సమర్పించిన ఆధారాలను పరిశీలించారు. రేణిగుంట మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మొత్తం 15,308 మందిని అనర్హులుగా గుర్తించి వారికి నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. నోటీసులు అందుకున్న వారికి తమ అర్హతను నిరూపించుకునేందుకు అవసరమైన ఆధారాలు, ధ్రువపత్రాలు సమర్పించే అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా అనర్హులుగా గుర్తించిన ఓటర్ల నుంచి అధికారులు అభ్యంతరాలు, అభ్యర్థనలను స్వీకరిస్తున్నారు.అందిన అభ్యర్థనలను క్షుణ్ణంగా పరిశీలించి, సమర్పించిన ఆధారాల ఆధారంగా అర్హతను నిర్ధారించిన అనంతరం నివేదికలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి తిరిగి ఓటు హక్కు కల్పించే అవకాశం ఉంటుందని వారు స్పష్టం చేశారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



రేణిగుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం జి.పాలెం పంచాయతీ కార్యా లయంలో శనివారం నిర్వ హించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో, తిరుపతిలోని అమెరికన్ లేజర్ ఐ ఆసుపత్రి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జి.పాలెం, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో వైద్యులు ప్రజలకు సమగ్రంగా కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలు ఉన్న వారికి అవసరమైన వైద్య సూచనలు అందించారు. కంటి సమస్యలకు సంబంధించి మరింత వైద్యం అవసరమైన వారిని గుర్తించి, వారికి తగిన చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించేలా రాజశేఖర్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అమెరికన్ లేజర్ ఐ ఆసుపత్రిలో ప్రస్తుతం రూ.5 వేల విలువైన రెటినోపతి స్క్రీనింగ్‌ను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యస్వీయూలో బీటెక్ (స్వీడన్)...

### ప్రవేశాలకు గడువు పొడిగింపు

తిరుపతి విద్య,ఆగస్టు 22 ప్రభాతవార్త:

యస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (స్వీడన్) కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు యస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తెలిపారు.యస్వీయూ, స్వీడన్‌లోని బ్లెకింగె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మధ్య కుదిరిన పరస్పర అంగీకార ఒప్పందం ప్రకారం నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో మూడు సంవత్సరాలు యస్వీయూలో, ఒక సంవత్సరం స్వీడన్‌లోని బ్లెకింగె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది. 2026–27 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల తొలుత ఆగస్టు 20వ తేదీతో ముగియగా, విద్యార్థుల సౌకర్యార్థం ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు యస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఎస్వీయూని వర్సిటీ.ఎడ్యు.ఇన్/డీఓఏ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## యూజీ, పీజీ పరీక్షల్లో మార్పు

తిరుపతి విద్య, ఆగస్టు 22 ప్రభాతవార్త:

మిలాద్‌ఉన్‌నబీ సెలవు తేదీలో ప్రభుత్వం మార్పు చేయడంతో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరగాల్సిన యూజీ, పీజీ పరీక్షల షెడ్యూల్‌లో మార్పు చోటుచేసుకుంది. ఆగస్టు 26వ తేదీన జరగాల్సిన పరీక్షలను ఒక రోజు ముందుకు జరిపి ఆగస్టు 25వ తేదీన నిర్వహించనున్నట్లు యస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రామమాణిక్యం తెలిపారు.యూజీ ఇన్‌స్టంట్ రెండో, ఐదో సెమిస్టర్ పరీక్షలతో పాటు పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలను కూడా ఆగస్టు 25వ తేదీన నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మిలాద్‌ఉన్‌నబీ సెలవును ఆగస్టు 25 నుంచి 26వ తేదీకి మారుస్తూ జీఓ జారీ చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు మారిన పరీక్ష తేదీని గమనించి, ఆగస్టు 25న యథావిధిగా పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

## విద్యార్థుల్లో పర్యావరణపై అవగాన వనమహోత్సవం




తిరుపతి విద్య, ఆగస్టు 22 ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాన పెంపొందించడంతో పాటు కళాశాల ఆవరణను పచ్చదనంతో నింపే లక్ష ్యంతో ఎస్.వి. అగ్రికల్చ రల్ కాలేజీలో ఎన్ఎస్ ఎస్ యూ నిట్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునగ, కరివేపాకు, బత్తాయి, దానిమ్మకు చెందిన 42 మొక్కలను కళాశాల ఆవరణలో నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా విద్యార్థులు తీసుకోవాలని నిర్వాహకులు సూచించారు. మొక్కల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యతతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని అసోసియేట్ డీన్ (ఐ/సి), సీనియర్ ప్రొఫెసర్, వ్యవసాయ విస్తరణ శాఖాధిపతి డా. టి.లక్షి ్మ నాయకత్వం లో నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డా. పి.లత, డా. పి. శాంతి, డా.వి.శైలజ, డా.జి.ఎస్. పాండురంగ ఏర్పాట్లను పర్యవేక్షి ంచారు.

## చిరంజీవి జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు

తిరుపతి విద్య, ఆగస్టు 22 ప్రభాతవార్త:



మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో భారీ కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం రుయా ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ స్వయంకృషితో చిరంజీవి మెగాస్టార్‌గా ఎదిగి, దశాబ్దాలుగా తన నటనతో కోట్లాది మంది ప్రేక్షకులను అలరిస్తున్నారని అన్నారు. కృషి, పట్టుదలతో ఎదిగిన చిరంజీవి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి, తమ్మినేని వెంకటేశ్వరరావు, ఎస్.కె. బాబు, హరిశంకర్, జీవకోన సుధాకర్, కొండా రాజ్‌మోహన్, రాజేష్ ఆచారి, బండ్ల లక్షి ్మపతి రాయల్, బాలిశెట్టి కిశోర్, బాబ్జీ, ఏ. వెంకటేష్, జీవన్ రాయల్, సుమన్, ఆళ్వార్ మురళీ, రమేష్ నాయుడు, శిరీష, రవి, సుబ్బారావు, చిన్నా, రమణారెడ్డి, మధులత, జానకిరామ్ రెడ్డి, ఉదయ్, పవన్ ముఖేష్, జిన్నా తదితరులు పాల్గొన్నారు.

## జనవాణికి పోటెత్తిన ప్రజలు...39 వినతుల స్వీకరణ

### -వినతులపై తక్షణమే చర్యలు తీసుకోండి : ఎమ్మెల్యే



తిరుపతి విద్య, ఆగస్టు 22 ప్రభాతవార్త:

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపేందుకు జనసేన పార్టీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం తన కార్యాలయంలో జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా మొత్తం 39 వినతులు అందాయి.నగరపాలక సంస్థకు సంబంధించిన సమస్యలపై అత్యధికంగా 23 అర్జీలు అందగా, హెల్త్ ఆఫీసర్‌కు 6, మేనేజర్‌కు 5 వినతులు వచ్చాయి. ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐకి ఒకటి, ట్రాఫిక్ డీఎస్పీకి రెండు, డీఎంఅండ్‌హెచ్ఓకు రెండు అర్జీలు అందాయి.ప్రజలు సమర్పించిన వినతులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సంబంధిత అధికారులకు పంపిస్తూ వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే జనవాణి ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎస్పీడీసీఎల్ ఏడీ ఆంజనేయులు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ సమావేశం

పుత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త:



పుత్తూరులో భారతీయ జనతా పార్టీ పట్టణ సమావేశం పట్టణ అధ్యక్షుడు గురుప్రసాద్ అధ్యక్షతన జరిగింది. జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక సమస్యలపైన ముఖ్యంగా గేటుపుత్తూరుకు అండర్ బ్రిడ్జి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి కూలంకుషంగా చర్చించారు. మండల కో-ఆర్డినేటర్‌గా మహేంద్రవర్మని నిర్ణయించి ఆయనను కార్యకర్తలు సన్మానిం చారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రజలకు కల్పిస్తున్న ప్రయోజనాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోటకొండ బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి మునికృష్ణనా యుడు, మేకల సుబ్రహ్మణ్యం, మధు, శేఖర్, వెంకట్రాయులు, హరి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## పరిశుభ్రత అందరి బాధ్యత : ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 22 ప్రభాతవార్త:



తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పారిశుద్ధ కార్మికులు చేస్తున్న సేవ ఎనలేనిదని ఆయన అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్పొరేషన్ అధికారులు శుభ్రపరిచారు. స్వచ్ఛాంధ్రకు కట్టుబడి పరిశుభ్రతలో భాగస్వాములవుతామని ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సాధనే లక్ష్యంగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో అలాగే నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. నిత్యం నగరానికి వచ్చే వేలాది మంది భక్తులకు అసౌకర్యం కలగకుండా పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికుల సేవ ఎనలేనిదని ఆయన చెప్పారు. నగరంలో మూడు షిఫ్టుల్లో పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారని ఆయన తెలిపారు. చెత్తా చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ ప్రజలు పడవేయరాదని అదనపు కమిషనర్ శారదా దేవి కోరారు. పరిశుభ్ర తిరుపతి సాధనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ కార్పొరేటర్ ఎస్కే బాబు, హెల్త్ ఆఫీషర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్ , ఆర్ ఓ లు సేతు మాధవ్, రవి, డిఈలు పాల్గొన్నారు.

## ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

చంద్రగిరి, ఆగస్టు 22 ప్రభాతవార్త:



చలనచిత్ర రంగంలో మెగాస్టార్‌గా వెలుగొందుతున్న చిరంజీవి జన్మదిన వేడుకలను శనివారం చంద్రగిరిలో అభిమానులు ఘనంగా జరుపుకు న్నారు. స్థానిక టవర్‌క్లాక్ వద్ద కొండూ రు ప్రవీణ్ రాయల్, గోపి రాయల్, బెల్లం కొండ రమేష్ రాయల్, రాజా రాయల్, దండు లక్ష్మీపతి ఆధ్వర్యంలో అభిమానులు భాణా సంఛాపేళుళ్ళ నడుమ కేక్ కట్ చేసి పరస్పరం తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో లంకెళ్ళ లలిత, నిరంజన్ రాయల్, గ్యాస్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో శ్రీనివాసుడు

చంద్రగిరి, ఆగస్టు 22 ప్రభాతవార్త:



శ్రీనివాసుడు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం సాయంత్రం ఆలయ అర్చకులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ ఆఫీసర్ పి.వరలక్ష్మి గారు, టెంపుల్ ఏఈఓ యం.గోపీనాథ్, ఆలయ సూపరింటెండెంట్ రాజ్ కుమార్, టెంపుల్ ఇన్స్పెక్టర్ ద్వారక ముని కుమార్, ఆర్జితం ఇన్స్పెక్టర్ ఆనంబట్టు ధనశేఖర్, అర్చకులు ఆంజనేయ చార్యులు సెక్యూరిటీ విభాగము గంగాధర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నాలుగవ రోజు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం

పులిచెర్ల, ఆగస్టు 22 ప్రభాతవార్త:



ఆరు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా పులిచెర్ల మండలంలోని అంగన్వాడి కార్యకర్తలకు శనివారం నాలుగవ రోజు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని కల్లూరు జడ్పీ హైస్కూల్ నందు నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో పులిచర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వాణిశ్రీదేవి మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలకు ఆరు రోజుల జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. శిక్షణలో భాగంగా పిల్లలలో సమ్మిళిత విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఇందులో 21 రకాల వైకల్యాలు ఉంటాయని వాటిని ముందుగానే గుర్తించి పిల్లలకు అనుగుణంగా వాళ్లకు విద్యను బోధించినట్లయితే పిల్లల్ని మామూలు పిల్లవాడు లాగా తయారు చేయవచ్చు అని తెలియజేశారు. పిల్లలందరితో సమానంగా కూర్చోబెట్టి ప్రత్యేక అవసరాలు గల పిల్లలుకు కూడా విద్యను బోధించాలని తెలియజేశారు. అదే విధంగా అంగన్వాడి కేంద్రాలలో పౌష్టికాహారంతో పాటు పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యా బోధన చేయడం జరుగుతుందన్నారు. పిల్లలు యొక్క అభ్యసన సామర్థ్యాలను తల్లి దండ్రులకు తెలియజేయడానికి ప్రతినెలా కూడా అంగన్వాడి కేంద్రాలలో నాలుగో శనివారం ఈసీసీఈ డే నిర్వహించి పిల్లల యొక్క అభ్యసన సామర్థ్యాలను తల్లిదండ్రులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు హై స్కూల్ హెచ్ఎం శ్రీ వాణి, డిఆర్పీలు రామాంజులు, కృష్ణవేణి. నరేష్. ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి. సుహాసిని, అంగన్వాడి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో అలరించిన సంగీత విభావరి

సత్యవేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త:



శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమం విభావరి కార్యక్రమం శ్రోతులను ఎంతగానో అలరించింది. సూళ్లూరుపేట కేఎస్ కళా నిలయంకు చెందిన కుమారి కంచెర్ల చంద్రలేఖ బృందం అన్నమాచార్యులు, శ్రీరామదాసు తదితర వాగ్గేయకారుల భక్తి కీర్తనలను మధురంగా ఆలపించారు. గణపతి ప్రార్థనతో ప్రారంభమై, కుమారి మోక్షిత శ్రీమద్భగవద్గీత పఠనం అనంతరం చంద్రలేఖ, వంశీ, మాచర్ల బత్తినయ్య భక్తి గీతాలతో సంగీత విభావరి కార్యక్రమం శ్రవణానందంగా రసమయ భరితంగా సాగింది. గాయకులకు సంగీత కళాకారులు మాచర్ల బత్తినయ్య(కీ బోర్డు), కొండ వీరస్వామి(తిబల) వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమం అనంతరం శ్రీవాణి తరపున కళాకారులను ఘనంగా సత్కరించారు. శ్రీసిటీ ఉద్యోగులు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు సాంస్కృతిక ప్రియులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీసిటీ పచ్చని పరిసరాలు, ఆలయ ప్రశాంత వాతావరణం మధ్య భక్తి సాహిత్యం, సంగీతం సమ్మేళనంగా ఈ కార్యక్రమం నిలిచింది. భక్తులకు తీర్థ, అన్నప్రసాదం పంపిణీ చేశారు. అలాగే శనివారం ఉదయం ఆలయంలో సంప్రదాయ గోపూజ నిర్వహించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. శ్రీసిటీ పీఆర్ ప్రతినిధి పల్లేటి బాలాజీ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో సత్తా చాటిన విద్యార్థులు

పుత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త:




పట్టణంలోని స్వామిశృది శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ వేదికపై తమ ప్రతిభను చాటారు. ప్రతిష్టాత్మకమైన నాసా స్పేస్ సెంటర్‌లో విశిష్ట ప్రదర్శన కబనరచి బహుమతులు సాధించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు అవార్డులు సాధించారు. ఈ విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరవణ మెమెంటో, సర్టిఫికెట్లుతో అభినందించారు. కార్యక్రమంలో జోనల్ కో-ఆర్డినేటర్ బాలాజీ, డీన్ మోహన్, సీ ఇన్‌చార్జి రూపావాణి, భాగ్యలక్ష్మి, మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సారె సమర్పణలో భక్తులు



తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్త:
శ్రీవారి తల్లి వకుళమాత అమ్మవారి దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షి ంచారు. శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా వకుళమాతకి తిరుపతి నగర సంకీర్తన మండలి సభ్యులు,రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీ ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, చీర,పండ్లు తో అమ్మవారికి సారె సమర్పించారు. శ్రీవేంకటేశ్వర స్వామి వేషధారణగా మిట్టపల్లి బ్రహ్మానందరెడ్డి, శ్రీదేవి భూదేవి వేషధారణలుగా బుజ్జమ్మ, గీత అమ్మవారిని మొక్కుకున్నారు దర్శనం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి,చిగోరా ఆధ్యాత్మిక కేంద్రం చిత్రపు హనుమంతరావు, నగర సంకీర్తన మండలి సభ్యులు మేడసాని మోహన్ నాయుడు, నరేష్ చౌదరి, లోక ప్రభాకర్ రాయుడు, అరుణమ్మ, పావని, చంద్రా, నాగార్జున రెడ్డి, రామ్ కుమార్, విగ్రహాల కళ్యాణి ,పద్మావతి ,భాగవతుల జయలక్ష్మి ,లక్ష్మి రంగనాథన్, లీలావతి, కొండే చెంగారెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం,మల్లారపు వాసు దంపతులు పాల్గొన్నారు.

## షావుకారు జానకికి...రాయలసీమ రంగస్థలినివాళి

తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్త:



తెలుగు సినీ రంగంలో నటి, రంగస్థలి కళాకారిణి షావుకారు జానకి మరణం పట్ల రాయలసీమ రంగస్థలి కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు. ఘంటసాల విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి నేతృత్వంలో కళాకారులు పుష్పాంజలి ఘటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కె.ఎన్. రాజా, సభ్యులు టీచర్ తిరుమలయ్య మాట్లాడుతూ షావుకారు జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వందలాది చిత్రాల్లో నటించి తన సహజ నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని అన్నారు. కళా రంగానికి ఆమె చేసిన సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రధానం చేసిందని గుర్తు చేశారు.. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్, కార్యదర్శి కె.ఎన్. రాజా, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కొట్టే సుబ్రహ్మణ్యం, టీచర్ తిరుమలయ్య, పోతే జనార్ధన్, చిత్రపు హనుమంతరావు, సురేష్, పొన్నాల జేజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసిల ద్రోహి జగన్ : ఆనంద గౌడ్

తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్త:
బిసిల రిజర్వేషన్లు 24 శాతం కుదించి జగన్ అన్యాయం చేస్తే, సిఎం చంద్రబాబు నాయుడు బిసిలకు సామాజిక న్యాయం చేశారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్ పేర్కొన్నారు. వైసిపి హయాంలో బిసిలను ఊచకోత కోస్తే, నేడు వారి రక్షణ కోసం చంద్రబాబు చట్టాన్ని తీసుకొస్తున్నారన్నారు. గత వైసిపి పాలనలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా బిసిలు ఆర్తనాదాలే అని ఆవేదన చెందారు. దుర్మార్గ పాలనలో రేపల్లెలో బిసి బాలుడు అమర్నాథ్ గౌడ్‌ని పెట్రోల్ పోసి తగుల బెట్టారని, బాపట్ల జిల్లా చినగంజాంలో మహిళను వివస్త్రను చేసి దాడి చేశారని గుర్తుచేశారు. బిసిలపై చేయి వేయాలంటేనే భయపడేలా సిఎం బిసి రక్షణ చట్టం తెస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. బిసిలు ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యం అని ఆనంద్‌గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బిసిల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు.

## భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన



తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్త:
తిరుపతి నగరంలో శనివారం తెల్లవారుజామున భక్తి పారవశ్యంలో నగరసంకీర్తన సాగింది. భజన మండలి సభ్యులు సేవా తత్పరతతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.సంకీర్తన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో ముగించారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు, ప్రముఖ ప్రవచనకర్త చంద్రమోళి, మునినాథరెడ్డి, కృష్ణంరాజు , సూర్యనారాయణ రాజు,గుండాలగోపీనాథ్‌రెడ్డి,తొండమనాటిసుబ్రహ్మణ్యంరెడ్డి,మిట్టపల్లిబ్రహ్మానందం,పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర



తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్త:
పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం చేపట్టారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఆచార్య ఐ.వి. లలితా కుమారి,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సమన్వయం చేశారు.

## అంకుర సంస్థల ప్రదర్శన మూల్యాంకన

తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్త:



ఐఐసిఆధ్వర్యంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మహిళా జీవసాంకేతిక అంకుర సంస్థల సదుపాయ కేంద్రం లో అంకుర సంస్థల ప్రదర్శన మూల్యాంకన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక అంకుర సంస్థలు తమ ఆవిష్కరణలు, ఉత్పత్తులు, సాంకేతికతలు వ్యాపార ప్రణాళికలకు సంబంధించిన ప్రజెంటేషన్లు అందించాయి. ఈ కార్యక్రమాన్ని ప్రాజెక్టు ప్రధాన పరిశోధకురాలు ఆచార్య ఎం. విద్యావతి ఆధ్వర్యంలో నిర్వహించగా, పరిశోధన సహాయకురాలు ఎ. అమల కార్యక్రమ నిర్వహణలో సమన్వయం వహించారు.

## ఎఇఇ నియామక పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి,ఆగస్టు 21ప్రభాతవార్త:



రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఎఇఇ పోస్టుల నియామకాల్లో భాగంగా అభ్యర్థులకు నియామక పరీక్షను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. సంస్థల్లో 629 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల నియామకాలకై ఈ పరీక్షకు 1,05,566 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈనెల 23 నుండి 27వతేదీ వరకు ఐదు రోజుల పాటు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి)ను నిర్వహించనున్నామని తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌తోబాటు ఇతర రాష్ట్రాల్లో కలిపి మొత్తం 94 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని వివరించారు.

## ఎస్వీబిసి చైర్మన్ శ్రీధర్‌వర్మకు



### స్థానికుల ఆత్మీయ సన్మానం

తిరుమలవాసిగా, అందరి వాడుగా ఉంటూ ఎస్వీబిసి ఛైర్మన్‌గా నియమితులైన బి.శ్రీధర్ వర్మను తిరుమల స్థానికులు కలిశారు. శనివారం ఉదయం ఆలయం వెలుపల ఆర్‌బి సెంటర్ వాసులు, వ్యాపారులు, స్నేహితులు కలసి ఆత్మీయంగా సన్మానించారు.

ప్రభాతవార్త-తిరుమల

## గ్రామాల అభివృద్ధే టిడిపి లక్ష్యం : ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



నింద్ర,ఆగస్టు 22 ప్రభాతవార్త : గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేయడమే టిడిపి లక్ష్యం అని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు.శనివారం మండలంలోని కొప్పేడు గ్రామంలో రు.36 లక్షలుతో నిర్మంచిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంబించినారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం చిత్తశుద్దితో ఖర్చు చేస్తున్నదని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకొని అన్ని వర్గాల వారిని సంతృప్తి పరుస్తున్నారని తెలిపారు.గ్రామీణ ప్రాంతాలలోనే వైద్యశాలలు ఏర్పాటు చేసి వైద్యం పేదలకు అందుబాటులో వుండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటావుందని అన్నారు.కార్యక్రమంలో యంపిపి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి, మాజీ శ్రీశైలం ట్రస్టు బోర్డు చేర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి,రాష్ట్ర టిడిపి యస్‌సి ఉపాధ్యక్షులు ధశరధ వాసు నాయకులు గందమనేని రాజేష్, వెంకట్వేశర్లురెడ్డి, రవినాయుడు, పరదేశి, భాస్కర్, జగన్, శివయ్య, నాగభూషణంరాజు, జయచంద్రారెడ్డి, మనోహార్ నాయుడు, రమేష్, దొరస్వామినాయుడు, బాబుయాదవ్, నందకుమార్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రతిభ



విజయపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా విజయపురం మండలం పన్నూరులో గల ప్రభుత్వ ఐటీఐ మొదటి సంవత్సరం(2025-26)కు విడుదల చేసిన ఎలక్ట్రీషియన్ ట్రేడ్ ఫలితాల్లో 600 మార్కులకు గాను 599 మార్కులు రామ్‌చరణ్, రాజ్ కిరణ్ అనే ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్ భైరవుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యార్థులు మండలంలోని ఆలపాకం గ్రామానికి చెందిన తండ్రి నాగరాజు(లేట్) తల్లి నాగజ్యోతి దంపతులకు కవల పిల్లలు కావడం విశేషం. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం మార్కులు సాధించడం పట్ల ప్రిన్సిపాల్‌తో పాటు శిక్షణ అధికారి, సహాయ శిక్షణ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## ఘనంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు



విజయపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త: మండలంలోని పన్నూరు గ్రామంలో శనివారం జనసేన మండల అధ్యక్షుడు స్వామినాథన్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన కేక్‌కట్ చేసి పలువురికి పంచిపెట్టారు.

## ఎంపీడీవో గైర్హాజరుపై విమర్శలు

– ఎన్నికల ప్రక్రియ సమయంలో పర్యవేక్షణ కరువు
– ఇబ్బందులు పడుతున్న కింది స్థాయి సిబ్బంది



రొంపిచెర్ల, ఆగస్టు 22 ప్రభాతవార్త: రొంపిచెర్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) మధుసూదన్ రెడ్డి విధుల నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కీలక పనులు జరుగుతున్న సమయంలో ఎంపీడీవో కార్యాలయానికి అందుబాటులో లేకపోవడంతో కింది స్థాయి అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 23న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉండగా, 22, 23 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు, పరిశీలన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ మొత్తం ప్రక్రియ ఎంపీడీవో పర్యవేక్షణలో జరగాల్సి ఉండగా, సంబంధిత అధికారి కార్యాలయంలో అందుబాటులో లేకపోవడం వల్ల సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని లాగిన్ ద్వారా పంపించాల్సి ఉండటం, ఇందుకు ఓటీపీ అవసరం కావడంతో ఎంపీడీవో కోసం సిబ్బంది పదేపదే ఫోన్ చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. కీలకమైన ఎన్నికల పనులు కొనసాగుతున్న సమయంలో అధికారి అందుబాటులో లేకపోవడం వల్ల కిందిస్థాయి సిబ్బందిపై పనిభారం పెరుగుతోందని పలువురు అంటున్నారు. అదేవిధంగా ఎంపీడీవో కార్యాలయంలో వారంలో నాలుగు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారనే విమర్శలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా ఎంపీడీవో కార్యాలయానికి హాజరు కాలేదని కొందరు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై ఎంపీడీవో వివరణ తెలియాల్సి ఉంది. ఎంపీడీవో రొంపిచెర్లలో బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి బొమ్మయ్యగారిపల్లి గ్రామ సచివాలయంలో నివాసం ఉంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎన్నికల ప్రక్రియ వంటి కీలక సమయంలో అధికారుల పర్యవేక్షణ ఎంతో అవసరమని, ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి సారించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## సమ్మేళత విద్యతో...పిల్లల మధ్య పరస్పర సహకారం

సత్యవేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త:



సమ్మేళిత విద్యతో పిల్లల మధ్య పరస్పర సహకారం పెరుగుతుందని తిరుపతి జిల్లా సత్యవేడు మండల విద్యాశాఖ అధికారి రవి చెప్పారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రెండో విడత జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో రవి మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్న పిల్లలతో సహా సాధారణ పాఠశాలలో ఒకే చోట కూర్చుని చదువుకోవడం సమ్మేళత విద్య లక్ష్యమన్నారు.కుల, మత, ఆర్థిక శారీరక తేడాలు లేకుండా అందరూ కలసి చదువుకోవచ్చునన్నారు. ఆంధులు, మూగ, చెవిటి, అభ్యాసనలో వెనుకబడిన పిల్లలను సాధారణ విద్యార్థులతో కలపాల్సిన అవసరం ఉందన్నారు. జ్ఞానజ్యోతిపై వివిధ అంశాలను రిసోర్స్ పర్సన్ అంగన్‌వాడి కార్యకర్తలకు వివరించారు. స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో దేవకుమారి ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్యాగరాజు, సుబ్రహ్మణ్యం, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ళ నమ్మకం అభివృద్ధే బాబు లక్ష్యం

సత్యవేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలోని ఇరుగుళం గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం డోర్‌టు డోర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శివకుమార్ నాయుడు, మాజీ క్లస్టర్ ఇన్‌చార్జి బాబు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను పంపిణీ చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాశీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ బాలసుబ్రహ్మణ్యం, అమాసరెడ్డి, తులసి, డేవిడ్,దిలీప్ రాయల్,జగన్, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దామలచెరువు వాసికి గౌరవ డాక్టరేట్



పాకాల, ఆగస్టు 22 ప్రభాతవార్త:
ఇండోనేషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో బంగళూరులో శనివారం నిర్వహించిన కాన్వొకేషన్ కార్యక్రమంలో పాకాల మండలం దామలచెరువుకు చెందిన మన్యం నరసింహులు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. వనస్థానచశ ఫార్మసీ, బయోటెక్నాలజీ రంగాల్లో మన్యం నరసింహులు అందించిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. అంతర్జాతీయ సదస్సులో చురుగ్గా పాల్గొని సేవలందించినందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

## చవితి ఉత్సవాల్లో రికార్డింగ్ డ్యాన్సులకు అనుమతి లేదు

రేణిగుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త:



వినాయక చవితి ఉత్సవాలను శాంతి యుత వాతావరణంలో, సంప్రదాయ బద్ధంగా నిర్వహించాలని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. వినాయక మండపాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, మండపాల వద్ద మహిళలను వేధించడం, ఆకతాయి చేష్టలకు పాల్పడటం, గొడవలు, అల్లర్లకు ఆస్కారం కల్పించడం వంటి చర్యలను సహించేది లేదన్నారు. మితిమీరిన అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వినాయక మండపాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా ఉత్సవ కమిటీ నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. పండుగను అందరూ కలిసిమెలిసి, ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ జయచంద్ర విజ్ఞప్తి చేశారు

## కులాల వారీగా ఓటర్ల జాబితా పరిశీలన



రేణిగుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త : పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌బాబు సమక్షంలో శనివారం ఓటర్ల జాబితాలో కులాల వారీగా వివరాల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. పంచాయతీ సిబ్బంది వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను పరిశీలిస్తూ కులాల వారీగా వివరాలను నమోదు చేస్తున్నారు.ప్రతి వార్డులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన ఓటర్లు ఎంతమంది ఉన్నారనే వివరాలను గుర్తించడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌బాబు తెలిపారు. ఓటర్ల జాబితాలను పరిశీలిస్తూ కులాల వారీగా వివరాల నమోదు ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం రేణిగుంట పంచాయతీ పరిధిలోని వివిధ కులాలకు చెందిన ఓటర్లు ఎంతమంది ఉన్నారనే వివరాలు స్పష్టమవుతాయని ఆయన తెలిపారు.

## గోడ ప్రతుల ఆవిష్కరణ



రేణిగుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త:
సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటైన సందర్భంగా బీఎంఎస్ అనుబంధ రైల్వే మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించనున్న తొలి జనరల్ బాడీ సమావేశానికి సంబంధించిన గోడప్రతులను శనివారం రేణిగుంట జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. బీఎంఎస్, బీఎంఆర్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొని పోస్టర్లను విడుదల చేశారు. బీఎంఎస్ జిల్లా కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ మాట్లాడుతూ, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటైన నేపథ్యంలో రైల్వే ఉద్యోగుల సమస్యలు, సంక్షేమం, సంఘటిత హక్కులపై చర్చించేందుకు తొలి జనరల్ బాడీ సమావేశాన్ని విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రైల్వే ఉద్యోగులు, సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.రైల్వే ఉద్యోగుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం బీఎంఎస్ అనుబంధ రైల్వే మజ్దూర్ సంఘ్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రానున్న సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు.గోడప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో లైన్ సెక్రెటరీపద్మనాభరెడ్డి, బీఎంఆర్ఎస్ టీఆర్ఎస్ చంద్రకాంత్, బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి సీనప్ప తదితరులు పాల్గొన్నారు.

## పద్మానగర్ పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

రేణిగుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త



రేణిగుంట మండలం జీపాలెం పంచాయతీ పరిధిలోని కుర్రకాలవ పద్మానగర్ నివాసితులకు తక్షణమే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు కార్తీక్ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.
పద్మానగర్‌లో 30 ఏళ్లుగా పేద కుటుంబాలు నివసిస్తున్నా, ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని కార్తీక్ తెలిపారు. సర్వే నంబర్లు 271, 272, 273, 274 పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని స్థానిక పేదలకు కేటాయించాలని కోరారు. గతంలో 62 కుటుంబాలకు స్థలాలు కేటాయించిన తరహాలోనే ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న అర్హులను గుర్తించి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అధికారులు వెంటనే స్పందించకపోతే ప్రజలను సమీకరించి దశలవారీగా ఆందోళనలు చేపడతామని కార్తీక్ హెచ్చరించారు. కార్యక్రమంలోసీపీఐనాయకులుసెల్వ,అములు,సాయమ్మ, శివగామి, రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధర్‌వర్మ సన్మానించిన కూటమి నేతలు



రేణిగుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త: ఎస్వీబీసీ (శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్) నూతన చైర్మన్‌గా శ్రీధర్ వర్మ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా శ్రీధర్ వర్మను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఎస్వీబీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ వర్మ భక్తి కార్యక్రమాల విస్తరణకు మరింత కృషి చేయాలని వారు ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో బాబు, నవీన్, జయ, చిన్నబాబు, మూర్తి, మున్నాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

## బొత్సను కలిసిన సిపాయి సుబ్రహ్మణ్యం

రేణిగుంట, ఆగస్టు 22 (ప్రభాతవార్త):



వైఎస్సార్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను శనివారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మర్యాద పూర్వకంగా కలిశారు. బొత్స సత్యనారాయణకు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం సాదర స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై చర్చించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకులు వినోద్ ఆధ్వర్యంలో బొత్స సత్యనారాయణకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ప్రభాకర్, భాస్కర్, సాంబశివరెడ్డి, వెంకటేష్, యుగంధర్, ఉపేంద్ర, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశక్తి పీఠంలో వైభవంగా ధర్మరక్షణ యజ్ఞం

రామచంద్రాపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త:
పీఠాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి దంపతులు రాయలచెరువులోని శ్రీశక్తి పీఠ మహాక్షేత్రంలో నిత్యం కొనసాగుతున్న ధర్మరక్షణ యజ్ఞంలో రాజంపేట శాసనసభ్యులు శ్రీ ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి దంపతులు విశేషంగా పాల్గొన్నారు. పీఠం ఆవరణలో నిర్వహించిన ఈ మహాయజ్ఞంలో స్వయంగా ఆహుతులు సమర్పించి, పీఠాధిదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠాధిపతులు, జగద్గురు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి వారిని, మరియు శ్రీ శక్తి పీఠాధీశ్వరి, మంత్ర మహేశ్వరి, శక్తి గురు శ్రీశ్రీశ్రీ రమ్యానంద భారతీ స్వామిని వారిని ఎమ్మెల్యే దంపతులు దర్శించుకుని, వారి దివ్య ఆశీస్సులు అందుకు న్నారు. పీఠం అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య వేదాశీర్వచనం గావించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

## అప్పుల బాధ తాళాలేక...

### జూ పార్క్ రోడ్డులోనే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య



తిరుపతి క్రైమ్ ఆగస్టు 22 ప్రభాతవార్త : రేణిగుంటలో నివాసం ఉంటూ ఆటో నడుపుతున్న వ్యక్తి అప్పుల బాధలు తాలలేక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ వి జూపార్క్ రోడ్డులో చోటు చేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ మద్దయ్యాచారి సమాచారం మేరకు చిత్తూరు పట్టణము సంతపేటకు చెందిన పురుషోత్తం (34)రేణిగుంటలో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.ఇది ఇలా ఉండగా శుక్రవారం తన మిత్రుడుకు ఫోన్ చేసి తాను అప్పుల బాధలు, బ్యాంకు సిబ్బంది వేధింపులతో తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతున్నానని, ఇకపై తాను జీవించలేని ఆత్మహత్య పాల్పడుతున్నట్లు సమాచారం ఇచ్చారు. తన మిత్రుడు ద్వారా సమాచార అందుకున్న మృతుడి అక్క హేమలత 112కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. సమాచార అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే మృతి చెందడంతో కేసు నమోదు చేసిమృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు.

## వ్యవసాయ పొలాల్లో...స్టాటరు కేబుల్‌వైర్ల చోరీ!

పెద్దపంజాణి, ఆగస్టు22 ప్రభాతవార్త:





మండలంలోని చామనేరు పంచాయతీ గోనుమాకులపల్లె గ్రామంలో శుక్రవారంరాత్రి మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డికి సంభందించిన వవయవసాయ పొలాల వద్ద స్టాటరు కేబుల్‌వైర్లను గుర్తుతెలియని దుండుగలు చోరీచేశారు.ఇటీవలకాలంలో గ్రామంలోఉన్న పలువురు రైతులకుచెందిన వ్యవసాయబోరు మోటార్ల స్టాటర్లు కేబుల్‌తీగలు తరచూ చోరీకి గురౌతున్నట్లు రైతులువాపోయారు.ఓ పక్క ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలసాగు గఘనంగా మారిన నేపథ్యంలో వ్యవసాయబోర్ల ద్వారా అంతోఇంతో పంటలను సాగుచేస్తున్న తమకు పొలాలవద్ద స్టాటర్లు కేబుల్‌వైర్లచోరీ పెద్దసమస్యగా మారుతోందని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ పొలాలవద్ద చోరీలపై పోలీసుఅధికారులు ప్రత్యేక నిఘాఉంచి ఇలాంటి సంఘటనలకు పాల్పడేవారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## రమేష్‌బాబు,రాములకు గురుపురస్కారాలు ప్రధానం

పెద్దపంజాణి ఆగస్టు 22 ప్రభాతవార్త:




హైదరాబద్‌లోని మహాశాస్తా సేవా సంఘం శనివారంనాడు గురుపురస్కారం -అన్నపూర పుర్ణపురస్కారం ప్రధానోత్సవం 2026 కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించింది. మండలంలోని బసవరాజు కండ్రిగకు చెందిన రమేష్‌బాబు గంగవరం మండలం కలగటూరుకు చెందిన రాములకు మహాశాస్తా సేవాసంఘం తరపున గురు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్బంగా పురస్కారాలు అందజేసి వారిని ఘనంగా సత్కరించారు. ఏటా అయ్యప్ప స్వాములకు గురుస్వాములు చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డులను సేవాసంఘం అందిస్తుందని తెలిపారు.వీరికి పురస్కారాలు రావడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## చెరువులో మట్టితరలిస్తున్న 14ట్రాక్టర్లు,2 జేసీబీలు సీజ్

పెద్దపంజాణి ఆగస్టు22 ప్రభాతవార్త:



మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న చెరువులో ఎలాంటి అనుమతులలేకుండా అక్రమంగా మట్టినితవ్వి తరలిస్తున్న 14ట్రాక్టర్లు 2జేసీబీ వాహనాలను సీజ్‌చేసి తహాశీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై సురేష్‌బాబు పేర్కొన్నారు.గ్రామాల్లో ఎవరైనా ముందస్తు అనుమతులు లేకుండా ట్రాక్టర్లు జేసీబీలద్వారా చెరువులు, కుంటలు, వాగులు, వంకల్లో అక్రమంగా మట్టినిగానీ ఇసుకనుగానీ తరలిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. కృత్రిమ ఇసుక తయారీదారులపై సైతం ప్రత్యేక నిఘాఉంచామని ఆయన తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదంఉందని ఎవరుకూడా చెరువుల్లో అక్రమంగా మట్టితవ్వకాలు చేపట్టరాదని ఎస్సై హెచ్చరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ వేదిక

-ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతిరూరల్, ఆగస్టు22 ప్రభాతవార్త:



ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని సమర్థవంతమైన వేదికగా మార్చుతున్నామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. తిరుపతి రూరల్ మండలంలోని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజక వర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలను ఎమ్మెల్యే అప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. భూ సంబందిత వివరాలు, పెన్సన్లు, రేషన్ కార్డులు, రహదారులు, విద్యుత్ వంటి పలు అంశాలపై ప్రజలు తమ వినతులను సమర్పించారు. సమస్యల స్వరూపాన్ని వివరంగా తెలుసుకున్న ఎమ్మెల్యే తక్షణ పరిష్కారం అవసరమైన అంశాలను సంబంధిత అధికారులకు తెలియజేసి, బాధితులకు వెంటనే చర్యలు తీసుకునేలా మార్గనిర్ధేశం చేశారు. చంద్రగిరి నియోజకవర్గాన్ని సమస్యల రహితంగా తీర్చిదిద్దడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ప్రజలతో నేరుగా మమేకమై వారి ఇబ్బందులను పరిష్కరించడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారుకూటమి నేతలు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## భార్యపై భర్త హత్యాయత్నం!

తిరుపతి, ఆగస్టు22 ప్రభాతవార్త:



భార్యపై అనుమానంతో బండరోలుతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన తిరుపతి ఈస్ట్‌పోలీస్ స్టేషన్ పరిధిలోనిజయానగరు లో శనివారం చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్ ఐ రామస్వామి సమాచారం మేరకు టైలరింగ్ పనిచేస్తున్న షేక్‌మల్లికకు ముగ్గురు కుమార్తెలు. అందులో ఇద్దరి కుమార్తెలకు వివాహంకావడంతోచివరికుమార్తెతో భార్య భర్తలు ఇద్దరు కలసి నివసిస్తున్నారు.ఇది ఇలావుండగా భర్త షేక్ మస్తాన్ భార్య మల్లికపై అనుమానంతో కుటుంబంలోతరచూ కలహాలు ఏర్పడేవి. భార్య పైకక్షపెంచుకున్న భర్త అర్థరాత్రి తరువాత బండరోలుతో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మల్లిక అరుపులు విన్న కుమార్తె యాస్మిన్ స్థానికులతో రక్షి ంచి అంబులెన్సు వాహనంలో ఆసుపత్రికి తరలించారు. మస్తాన్ చేతిలో తీవ్రగాయాలైన మల్లికను రుయా ఆసుపత్రి తరలించగా మెరుగైన వైద్యం కోసం స్విమ్స్ ఆసుపత్రికి మార్చారు. అనంతరం బాధితురాలు కుమార్తె యాస్మిన్ తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూతురు ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు సంబంధిత కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి ఆగస్టు 22 ప్రభాతవార్త:




శ్రీకాళహస్తిలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వ హించనున్న 9వ రాష్ట్ర మహాసభ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుభవిస్తున్న విధానాలపై పోరాటాలే లక్ష్యంగా పోరాటాలు సాగిస్తున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు పాటూరి వెంకటరత్నం మీడియాతో మాట్లాడుతూ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏఐకేఎంఎస్ 9వ మహాసభలను సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరిం చారు అదేవిధంగా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు సెప్టెంబర్ 11, 12 తేదీలలో అనంతపురంలో నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర 9వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ పత్రికా సమావేశంలో ఐఎఫ్టియు నాయకులు ఎస్. జాకీర్, బుర్ర కృష్ణమూర్తి. మురుగేషన్ ఏకేఎంఎస్ నాయకులు. బత్తయ్య. మోహన్ నాయుడు. రాజయ్య. సుబ్రహ్మణ్యం నాయుడు. దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు సరికొత్త పాఠాలు!

తొట్టంబేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త:



రాష్ట్ర విద్యాశాఖలో పలు మార్పులు చేర్పులు చేపడుతున్నారు. విద్యాప్రమాణాలను పెంచుటకు తీసుకుంటున్న నిర్ణయాలు రాబోవు రోజుల్లో విద్యార్థుల జీవితాలకు ఉపయోగపడే అంశాలను పొందుపరుస్తున్నారు. అయితే ప్రభుత్వ లక్ష్యాలు ఉద్దేశాలు తెలుసుకోలేని అంగన్‌వాడీల పరిస్థితి దయనీయంగా ఉంది. సాధారణంగా టీచర్లు పిల్లలకు పాఠాలు చెబుతారు. కానీ ఇక్కడ మాత్రం టీచర్లకే పాఠాలు చెబుతున్నారు! అది కూడా పిల్లలతో ఎలా ఆడుకోవాలి, ఎలా నవ్వించాలి, తల్లులకు ఎలా అర్థమయ్యేలా చెప్పాలి అనే అంశాలపై తొట్టంబేడు మండలం పెద్దకన్నలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ నాలుగో రోజు కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న ఈ శిక్షణ సాదాసీదా మీటింగ్ లా కాకుండా, ఒక పండగలా సాగుతోంది. ప్రధానోపాధ్యాయురాలు లత, ఎంఈఓసి హెచ్ భారతి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ శిక్షణలో డిఆర్‌పి సూర్య, ధనలక్ష్మి, సూపర్‌వైజర్లు మరియమ్మ, మంజులలు కార్యకర్తలతో కలిసి నేలపై కూర్చొని ఆటల ద్వారా పాఠాలు చెబుతున్నారు. పుస్తకాల్లో ఉన్న విషయాన్ని వంటింటి వరకు, పిల్లాడి ఎదుగుదల వరకు ఎలా తీసుకెళ్లాలో నేర్చుకుంటున్నామని వారు చెబుతున్నారు.

## నచ్చనేరిలో కల్తీ పెట్రోల్ -ప్రశ్నించిన దళిత యువకుడుపై దాడి!



ఏర్పేడు ఆగస్టు 22 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం నచ్చనేరి గ్రామంలోని పెట్రోల్ బంకులో చోటుచేసుకున్న ఘటన ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పెట్రోల్ లో కల్తీ జరుగుతోందని అనుమానం వ్యక్తం చేసి ప్రశ్నించినందుకు ఓ దళిత యువకుడిపై బంక్ యజమాన్యం దాడికి పాల్పడటం తీవ్ర విమర్శలకు దారితీసింది. మనసముద్రం గ్రామానికి చెందిన మహేష్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనం సరిగా మైలేజీ ఇవ్వకపోవడం, ఇంజన్ లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అనుమానంతో తిరిగి బంక్ సిబ్బందిని నిలదీశాడు. అయితే దీనికి సమాధానం ఇవ్వాల్సిన బంక్ యజమాని, సిబ్బంది అతనిపై దౌర్జన్యంగా దాడికి పాల్పడ్డారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనను భారత కమ్యూనిస్ట్ పార్టీ తీవ్రంగా ఖండించింది. సీపీఐ నాయకులు జనమాల గురవయ్య ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్, పౌర సరఫరాల శాఖ, పోలీస్ శాఖ అధికారులు ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ హెచ్చరించింది.

## ఢిల్లీలో సేవా సంకల్ప్ ఉత్సవ్ కమిటీ సమావేశం

శ్రీకాళహస్తి ఆగస్టు 22 ప్రభాతవార్త:



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సేవా సంకల్ప్ మహోత్సవ్ కార్యక్రమాల నిర్వహణపై ఢిల్లీలో కీలక సమావేశం జరిగింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 ఏళ్లు, దేశ ప్రధానమంత్రిగా 12 ఏళ్లుగా సాగుతున్న మోదీ గారి సుదీర్ఘ ప్రజాసేవకు గుర్తింపుగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, బొల్లిన నిర్మల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, మాజీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు సునీల్ ఇస్కా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ మాట్లాడుతూ మోదీ 25 ఏళ్ల పాలన అభివృద్ధికి, సుపరిపాలనకు నిదర్శనమని, సేవా పక్షోత్సవాలను రాష్ట్రంలోని ప్రతి మండలంలో విజయవంతం చేస్తామని తెలిపారు.

## బిసి నాయకత్వాలను ప్రోత్సహించింది టిడిపినే!

శ్రీకాళహస్తి ఆగస్టు 22 ప్రభాతవార్త:



సాంప్రదాయిక కుల వృత్తులను చేసుకొని జీవించే వారిని సామాజికంగా సంఘం నుండి వెలి వేయబడ్డవారిని అభివృద్ధి లోకి తీసుకురావాలన్న లక్ష్యంతో స్థాపించిన తెలుగుదేశం పార్టీ మాత్రమే బిసి నాయకత్వాలను ప్రోత్సహించిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యం.ఉమేష్ రావు కొనియాడారు. వారు మాట్లాడుతూ ఇంటింటికి తెలుగుదేశం పార్టీఖి కార్యక్రమంలో భాగంగా, రెండేళ్లలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం యొక్క రెండేళ్ళ నమ్మకమైన పాలనాకాలంలో అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఈరోజు 52 వ బూత్ కన్వీనర్ గాజుల భగత్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఈరోజు శ్రీకాళహస్తి పట్టణంలోని స్థానిక 18 వ వార్డు, 52 వ బూత్, మరాఠీ పాలెం లోని ప్రజల వద్దకు వెళ్ళి కరపత్రాలను అందించి వివరించారు. ఈ కార్యక్రమంలో డా.జి.దశరథాచారి, మిన్నల్ రవి, డా.యం.ఉమేష్ రావు, బీమాల భాస్కర్, ఖాదర్, గాజుల భగత్, చిల్లకూరు మణి, పూల శేఖర్, గంగనపల్లి రమేష్, శంకరయ్య, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన

తొట్టంబేడు, ఆగస్టు 22 , ప్రభాతవార్త :



తొట్టంబేడు మండలం చియ్యవరం, కాసరం జంక్షన్ వద్ద శనివారం పోలీసులు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బాలకృష్ణ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, ప్రాణ నష్టం గురించి వాహనదారులకు వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

## శాంతిభద్రతులు నెలకొల్పాలి: సీఐ

రైల్వేకోడూరు రూరల్, ఆగస్ట్ 22ప్రభాతవార్త:



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతా ల్లోని ప్రజలు శాంతియుత వాతా వరణం నెలకొల్పాలని రైల్వేకోడూరు సిఐ చంద్రశేఖర్ అన్నారు. శనివారం రైల్వేకోడూరు మండలంలోని ఓబనపల్లి గ్రామాలలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమైన సీఐ ఎలాంటి గొడవలు వివాదాలకు తావివ్వకుండా శాంతియుతంగా గ్రామీణ ప్రాంతాలలో ఉండాలని ఆయన సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా పోలీసులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు.ప్రజల భద్రత శాంతి భద్రత పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం అందుబాటులో ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్‌ను పరామర్శ

శ్రీకాళహస్తి ఆగస్టు 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డిని శనివారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారి సహచరులు పరామర్శించారు. కృష్ణారెడ్డి శస్త్ర చికిత్స జరిపించుకొని ఇంటిలో విశ్రాంతి పొందుతున్నారు. అలాగే తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామానికి చెందిన దశరధరామిరెడ్డి ఆరోగ్యసమస్యలను ఎదుర్కొంటూ వైద్యసేవలందుకున్నారు. ఆయన్ను ఇంటి వద్ద వైకాపా నాయకులు పరామర్శిం చారు. ఆయనతో పాటు మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,తొట్టంబేడు నాయకుడు ఉమ్మడి చిత్తూరుజిల్లా ప్రధానకార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, మైనారిటి నాయకులు పఠాన్ ఫరీద్‌ఖాన్, గోరా,సిరాజ్‌బాషా, ఢిల్లిబాబు రెడ్డి, ఫజల్‌బాషా, మహబూబ్‌బాషా, ప్రభాకర్, జులేషా, నెలవల ప్రసాద్,పసల యుగంధర్, మణి, సయ్యద్ యాకూబ్, చందు,దివ్యకాంత్,తొట్టంబేడు నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు, మండల నాయకులు కన్నలి భాస్కర్‌రెడ్డి, మల్లికమ్మ, డాక్టర్ కోగిల సుబ్రమణ్యం, చైతన్యరెడ్డి,సునీల్‌రెడ్డి, లక్ష్మయ్య,వినీత్,యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో నందమూరి మోహన్ కృష్ణ

శ్రీకాళహస్తి,ఆగస్టు 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని నిర్మాత నందమూరి మోహన్‌కృష్ణ కుటుం బసమేతంగా దర్శించుకున్నారు. వారిని దక్షిణ గోపురం వద్ద రిషితారెడ్డి మహిళలు స్వాగతం పలికారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌రెడ్డి, పిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంచేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. తరువాత ఆలయాభివృద్ధి గురించి స్థానిక రాజకీయాల గురించి రిషితారెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

## అన్నదానానికి విరాళం రూ.2లక్షలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి భూరి విరాళాలు అందుతున్నాయి.ఈ నేపథ్యంలో శనివారం నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డి పాళెంకు చెందిన గాదిరెడ్డి బుజ్జమ్మ సహచరులతో కలసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఎఇఓ లోకేష్‌రెడ్డిని కలసి నిత్యాన్నదాన పథకానికి విరాళం ఇవ్వాలని కోరారు.ఆమె నిత్యాన్నదాన పథకానికి రూ.2లక్షల 116లు అందించారు.ఈ మొత్తాన్ని అకౌంటెంట్‌కు అందించారు.వారికి ఆలయ మర్యాదలతో పిఆర్‌ఓ రవి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలను అందించారు.

## అలుగు ఉత్సవం...ఊరేగింపు

ఏర్పేడు,ఆగస్టు 22 ప్రభాతవార్త:



ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం అలుగు ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయం నుంచి పోతు రాజుతో పాటు ఆలయంలో ఆదివారం జరిగే అగ్నిగుండ ప్రవేశం సందర్భంగా ఎలాంటి అవరోధాలు జరగకుండా అలుగుపై కత్తి నిలిపే కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో శనివారం అలుగును చక్కగా అలంకరించి ఊరేగింపు జరిపారు. పేటలోని నాలుగు మాడావీధులతో పాటు ఆలయ పరిసరాల్లో ఉత్సవాలను కన్నుల పండువగా జరిపారు. ఉత్సవానికి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలను చేనేత సంఘం తరఫున నిర్వహిస్తున్నారు.

## మార్కెటింగ్ కమిటి రెండవ దశ...

### అభివృద్ధి పనులకు రూ.83లక్షలు

శ్రీకాళహస్తి రూరల్ ఆగస్టు 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెటింగ్ కమిటి అభివృద్ధి పనులను రూ.83 లక్షలు కేటాయిస్తూ శనివారం జరిగిన సర్వసభ్య సమా వేశంలో తీర్మానించారు. శనివారం సమావేశం అధ్యక్షులు రంగినేని చెంచయ్యనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రంగినేని చెంచయ్య నాయుడు మాట్లాడుతూ మాట్లాడుతూ 11 ఎకరాల్లో విస్తరించబడి ఉందన్నారు. ఇక్కడ అభివృద్ధికి పలు ప్రతిపాదనలు చేసారు. ఇందులో ప్రధానంగా పరిపాలనా భవనాల వద్ద మొదటి అంతస్తులో చైర్మెన్ ఛాంబర్‌తో పాటు మీటింగ్ హాల్‌తోపాటు మరమ్మత్తులకు రూ.33లక్షలు కేటాయించారు.మార్కెటింగ్ కమిటి ఆవరణలోని 2,3,5 గోదాములు నిర్మించి చాలా కాలమైనందువల్ల కొంతశిధిలావస్తకు చేరుకున్నాయి. దాంతో వాటిని మరమ్మత్తులు చేయుటకు రూ.18లక్షలు ుకేటాయించారు. కమిటి కార్యాలయ ఆవరణలో వెలసి ఉన్న సంపతీశ్వరస్వామి ఆలయం వెనుక వైపు పల్లుగా మారటంతో దానిని బాగు చేయుటకు చక్కటి తీర్మానం చేసారు. అలాగే ఇక్కడ బాగా ఎత్తుపెంచటానికి రూ.28లక్షలు కేటాయించారు. గేట్లు మరమ్మత్తులకు రూ.3లక్షలు ుకేటాయిస్తూ తీర్మానం చేసారు.కాగా షాపింగ్ కాంప్లేక్సులపై మొదటి అంతస్థు షాపింగ్ కాంప్లేక్సు నిర్మాణానికి సంబంధించి సమావేశంలో చర్చించారు. 2019లో కమిటికి ఏ అధికారాలు ఉన్నాయో ఆ అధికారాలను సాధించుటకు ప్రభుత్వాన్ని కోరాలని చర్చించారు.ఈ కార్యక్రమాల్లో చైర్మెన్ చెంచయ్యనాయుడుతో పాటు వైస్ చైర్మెన్‌గంగిరెడ్డి,డరెక్టర్లు అంకయ్య, మాధవంరెడ్డి, చలపతి,రమేష్,చంద్రావతి, భాగ్యలక్ష్మి, రేష్మా,భూలక్ష్మి,జయకుమారి, సునీత, మహహ్మద్ షాఫి, యాదగిరి, యానదయ్య,హమీదా పాల్గొన్నారు.స మావేశంను కార్యదర్శి కె.సెల్వకుమారి పర్యవేక్షించారు. సింగిల్ విండో అధ్యక్షుడు బత్తిరెడ్డి, వ్యవసాయాధికారి రమేస్‌రెడ్డి పాల్గొన్నారు.

## శివయ్యను దర్శించుకున్న ఎంఎల్‌సి

శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రసిద్ధ శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి శనివారం ఎమ్మెల్సీ జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులకు గ్రంథాలయ సంస్థ చైర్మన్, రెడ్డివారి గురవారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంట కడప డీసీఎంఎస్ చైర్మన్ జయ ప్రకాష్,పార్టీ నాయకులు రవీంద్ర తదితరులు ఉన్నారు.

## తుమ్మలగుంటలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుపతిరూరల్, ఆగస్టు22 ప్రభాతవార్త:

తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సేనాధిపతి ఉత్సవం వైభవంగా జరిగింది. ఈనెల 22 నుంచి 25వరకు నాలుగురోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. అంకురార్పణలో ఆలయ ధర్మకర్త డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబీకులు పాల్గొని, ప్రత్యేకపూజలు నిర్వహించారు. పవిత్రోత్సవాల ద్వారా ఆలయ పవిత్రతను కాపాడుతూ, తెలియక జరిగే దోషాల నివారణ జరుగుతుందని పండితులు తెలిపారు. ప్రతిరోజూ స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు.